# ప్రతి ఒక్కరూ గాంధీ మార్గంలో నడవాలి



గంజ్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్



ఎస్పీ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, అక్టోబర్ 2 : ప్రతి ఒక్కరూ గాంధీ చూపిన మార్గంలో నడవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కామారెడ్డిలోని గాంధీ గంజ్‌లో ఉన్న వ్యవసాయ మార్కెట్‌లో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని అన్నారు. మహాత్మా గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని కలెక్టర్ అన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా సహాయ నిరాకరణ వంటి ఎన్నో ఉద్యమాలు అహింసా మార్గంలో చేపట్టి బ్రిటిష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్టారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ గంజ్‌లోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఖైదీలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీసులు అధికారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలోని గంజ్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



జిల్లా జైలులో సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

## రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి, అక్టోబర్ 2 : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. 9వ తెలంగాణ రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2023 కరీంనగర్ జిల్లాలోని రీజినల్ స్పోర్ట్స్ స్టేడియంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన వివిధ అంశాల్లో రెండు గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్, 3 బ్రోంజ్ మొత్తం 8 మెడల్స్ సాధించినట్లు కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

## బీఎస్ఎఫ్ జవాన్‌కు సన్మానం



సీతారాంపూర్‌లో జవాన్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

దోమకొండ, అక్టోబర్ 2 : దోమకొండ మండలం సీతారాంపూర్‌లో బీఎస్ఎఫ్ జవాన్‌ను గ్రామస్తులు సోమవారం సన్మానించారు. మడ్డల శ్రవణ్‌కుమార్ ఇటీవల బీఎస్ఎఫ్ సైనికుడిగా ఉద్యోగం పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. యువత దేశ సేవా చేయడం అదృష్టంగా భావించాలన్నారు. శ్రవణ్‌ను స్ఫూర్తిగా తీసుకోవలన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, గంగయ్య, మైసాగౌడ్, రామస్వామిగౌడ్, వెంకటరెడ్డి, బసిరెడ్డి, యాదగిరి, బస్వయ్య, సురేందర్‌రెడ్డి, అంజాగౌడ్, శివశంకర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

బీబీపేట్, అక్టోబర్ 2 : జీవితంపై విరక్తితో ఒకరు మృతి చెందిన సంఘటన బీబీపేట్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేట గ్రామానికి చెందిన మాద్దురి పోచయ్య(50) ఆదివారం రాత్రి తమ కుల సంఘంలో డబ్బులు చెల్లించడానికి వెళ్తున్నానని తన భార్య బాలలక్ష్మికి చెప్పి వెళ్లాడన్నారు. రాత్రి వరకు ఇంటికి రాలేదని, చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. సోమవారం ఉదయం బీబీపేట చెరువులో మాద్దురి పోచయ్య మృతదేహం కనిపించిందన్నారు. పిల్లలు లేరని మనస్థాపానికి గురై మద్యానికి బానిసయ్యాడన్నారు. భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి భార్య బాలలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా దవాఖానకు మృతదేహాన్ని తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకువెళ్లాలి



గ్రామసభలో ఆదాయ వివరాలు చదువుతున్న ఈవో సాజన్య

దోమకొండ, అక్టోబర్ 2 : గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నట్లు సర్పంచ్ నల్లపు అంజలి అన్నారు. దోమకొండ గ్రామపంచాయతీలో సోమవారం గ్రామసభను సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి వార్డులో తాగునీటి సౌకర్యం, మురుగు కాలువలు, సీసీ రోడ్లు వేయించినట్లు పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు, ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిద్దికోవడమే లక్ష్యమని అన్నారు. గ్రామస్తులు పలు సమస్యలను విన్నవించగా విడుతల వారీగా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్, ప్రభుత్వ విప్‌నకు కృతజ్ఞతలు

భిక్కనూరు, అక్టోబర్ 2 : రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకుగాను సీఎం కేసీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు ప్రజాప్రతినిధులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో ఉన్న రేణుకాదేవి ఆలయానికి రూ.ఐదు లక్షలు, మత్తడి పోచమ్మ ఆలయానికి రూ.ఐదు లక్షలు, మార్కండేయ ఆలయానికి రూ.4 లక్షల నిధులు మంజూరు చేసినందుగాను ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు సర్పంచ్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ సిద్ధరాములు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రైతు బంధు సమితి గ్రామ కన్వీనర్ శివలింగం, గ్రామ శాఖ అధ్యక్షుడు బాల్‌చంద్రం, కుల సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా నల్లా నర్సింహులు జయంతి



నల్లా నర్సింహులు చిత్రపటానికి నివాళులఅర్పిస్తున్న పద్మశాలీ సంఘ నాయకులు

కామారెడ్డి, అక్టోబర్ 2 : జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్ల నర్సింహులు 97వ జయంతిని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కాముని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శంకర్, బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పోశవ్వ, కార్యదర్శి మంజుల, బీసీ సంఘం సహాయ కార్యదర్శి బొల్లు రాజ్ కుమార్, టౌన్ యూత్ అధ్యక్షుడు క్యాతం శ్రీకాంత్, యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మహేశ్‌కుమార్, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

# సిద్ధరామేశ్వర ఆలయ కోనేరు పరిశీలన



సిద్ధరామేశ్వర ఆలయ కోనేరును పరిశీలిస్తున్న కలెక్టర్, ప్రముఖులు

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

భిక్కనూరు, అక్టోబర్ 2 : మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆలయ ఆవరణలోని కోనేరును కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌తోపాటు పలువురు పరిశీలించారు. ఆలయ ఆవరణలో ఇటీవల పునరుద్ధరించిన కోనేరు పనులను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ది రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు కల్పనారమేశ్, ప్రముఖ ఆర్కియాలజిస్ట్, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో శివన నాగిరెడ్డి, తమిళనాడు కు చెందిన దాతలు సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పురాతన ఆలయాలు, చారిత్రాత్మక కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. వీటి గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయాలని, ప్రస్తుతానికి కోనేరు పునర్నిర్మాణ పనులు పూర్తి కావడంతో పర్యాటకులకు ఆధ్యాత్మికతతోపాటు ఆహ్లాదం పంచేలా ఉందన్నారు. ఇది గొప్ప కట్టడమని, వర్షపు నీటిని ఒడిసిపట్టి గ్రౌండ్ వాటర్‌ను పెంచేలా కోనేరును అభివృద్ధి చేశారన్నారు. ఇక్కడి నిర్మాణ శైలిని బట్టి చూస్తే ఇది 18వ శతాబ్దం నాటి కట్టడంగా నిపుణులు తెలిపారని, ఇది మెట్ల బావి అని అన్నారు. ఇలాంటి కట్టడాలను ఎక్కడ ఉన్నా రక్షించుకోవాల్సిన బాధ్యత మనఅందరిపై ఉందని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ దంపతులను ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనంతరావు, అర్చకులు సిద్ధగిరి శర్మ, రామగిరి శర్మ, రాజేశ్వర్ శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.